క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో బుధవారం మమత ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ మేఘన అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. అత్యవసర చికిత్స అవసరమున్న రోగులను ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించి, మమత ఆస్పత్రిలో చికిత్స అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు దీపక్ ఆగర్వాల్, ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మంగారి జాతర



బ్రహ్మంగారి గర్భగుడి

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో గురువారం పోతులూరి బ్రహ్మంగారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు బుధవారం నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బండ్ల ఊరేగింపు, సాయంత్రం 5 గంటలకు జడకొప్పు కళా ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

ధాన్యాన్ని వెంటనే తరలించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

టేక్మాల్(మెదక్): కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంట వెంటనే లారీల ద్వారా తరలించాలని రైతులు బుధవారం తహశీల్దార్ కృష్ణతో మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని సరిగ్గా కాంట చేయడం లేదని, చేసినా తరలించడం లేదని తెలిపారు. వారం రోజులుగా ఈదురు గాలులతో వర్షాలతో ధాన్యం తడుస్తుందని వాపోయారు. లారీలు త్వరగా రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయ ని చెప్పారు. సెంటర్లలో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి లారీల్లో తరలించాలని కోరారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ కృష్ణ ఉన్నత అధికారులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఇందులో నాయకులు నాయికోటి భాస్కర్, డైరెక్టర్ సాధు కిషన్, రైతులు, ఎల్లుపేట అంజయ్య, కేశిరెడ్డి, నాయికోటి శివరాజ్, మెరుగు రాములు, తంపులూరి కేశవులు, బోయిని అంబేష్, చాకలి ఎల్లయ్య, తలారి రాములు, వడ్ల ప్రసాద్, రాములు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు అడ్మిషన్లు ప్రారంభయ్యాయని చిన్నశంకరంపేట మోడల్ స్కూల్ అండ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఈ నెల 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు అందించాలని సూచించారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం కోసం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల్లో ఆంగ్ల మధ్యం కోసం అడ్మిషన్లు అందించాలని కోరారు. ఆన్‌లైన్ చేసిన కాపీని కళాశాలలో అందించాలని సూచించారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం



మాట్లాడుతున్న తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

చేగుంట(తూప్రాన్): ఎన్నికల రెమ్యునరేషన్ అడిగినందుకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో సోమవారం రాత్రి ఉపాధ్యాయులపై లాఠీ చార్జీ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అన్నారు. ఎన్నికల విధుల కోసం ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు పడుతూ సజావుగా ఎన్నికలు జరిగేలా చూస్తారని తెలిపారు. నిబంధనల ప్రకారమే తమకు ఎన్నికల రెమ్యునరేషన్ ఇవ్వాలని అడిగినందుకు అక్కడి ఎన్నికల అధికారులు లాఠీ చార్జీ చేయించారని ఆరోపించారు. ఉపాధ్యాయులపై లాఠీ చార్జీ చేయించిన అధికారులపై రాష్ట్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సురేందర్, వెంకటేష్, సంతోష్‌కుమార్, ప్రవీణ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే



నార్సింగిలో ఇళ్ల మధ్య మురుగుకూపం

ఇళ్ల మధ్యనే మురుగు
దుర్గంధం భరించలేకపోతున్నాం
స్థానికుల ఆవేదన

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని గొల్లవాడ వెనకాల ఇళ్ల మధ్య మురుగు కూపంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు ఈ దుర్వాసనను భరించలేకపోతున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి నుంచి మిర్జాపల్లి రైలు రోడ్డు నుంచి వరద, నివాస గృహాల మురుగు ఇక్కడికి వచ్చి చేరుతుంది. డ్రైనేజీలు నిర్మించాల్సిన పంచాయతీ అధికారులు దృష్టి సారించకపోవడంతో ఇళ్ల మధ్య గుంతల్లో మురుగు నిలిచిపోతోంది. మిర్జాపల్లి రోడ్‌కు దారి ఉన్నప్పటికీ బురదగా మారి రహదారి కనుమరుగైంది. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే మురికి కాల్వలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటికి తాళం పెట్టి మరోచోట ఉంటున్న..



మేము ఉంటున్న ఇళ్ల మధ్యనే మురుగుకూపం తయారుకావడంతో దురాసన భరించలేక ఇంటికి తాళం పెట్టి మరోచోట ఉంటున్న. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా.. డ్రైనేజీ నిర్మించడంలేదు. దీంతో మురుగంతా మా ఇళ్ల మధ్యన చేరి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో దోమలు, ఇతర కీటకాలతో ఆనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలి.
– నల్ల పోచయ్య, నార్సింగి

రాజ్‌పల్లిలో..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలంలోని రాజ్‌పల్లి గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై మురుగు పారుతుండడంతో దుర్వాసన వస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలో వచ్చే నీటిని మురుగు నీటి కాల్వల్లో వెళ్లేలా కాకుండా రోడ్డుపైకి వదలడం వల్ల రోడ్డు గుంతలమయంగా మారి దుర్వాసన వెదలజల్లుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై పారుతున్న మురుగునీటి ఇబ్బందిని తీర్చాలని కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు

కొనసాగుతున్న మహాయాగం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామంలో చతుర్వేత హవనం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ నెల 12 నుంచి 17 వరకు లోక కల్యాణం కాంక్షించి శ్రీ వేదమాత అనుగ్రహంతో చతుర్వేత హవనం చేపడుతున్నారు. పాలకుర్తి సుధాకర్ గౌతమ్‌శర్మ పర్యవేక్షణలో వేలేటి సిద్ధరామేశ్వర శర్మ ద్వివేది వైదిక నిర్వహణలో పూజ మహోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం చేపట్టిన పూజ మహోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ప్రతీ ఒక్కరు భక్తిమార్గాన్ని అనుసరించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాదగౌడ్, భిక్షపతిరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అర్చకులు శాస్త్రుల ఆయాధ్యరామశర్మ, చండీకశర్మ ప్రముఖులను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



ధాన్యం కొనుగోలు వివరాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): వరిధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6 కొనుగోలు కేంద్రాలు, దండుపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నిర్వాహకుల వద్ద ధాన్యం వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 13381 బస్తాలు కొనుగోలు చేశారన్నారు. అందులో 11801 బస్తాలను రైస్‌మిల్‌లకు తరలించినట్లు తెలిపారు. సంబంధిత రైతులకు డబ్బులు ముట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం తూకానికి 1580 బస్తాలు ఉన్నాయన్నారు. ప్రతీ గింజను కొనుగోలు చేస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా చూస్తున్నామన్నారు.

మెదక్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు

పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మెదక్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉద్యమాల ఖిల్లా మెదక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజారిటీతో గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండు జాతీయ పార్టీలపై బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు.

వారం రోజుల్లో మారిన వాతావరణం

చేగుంట(తూప్రాన్): వారం రోజుల్లో మండుతున్న ఎండలతో ఇబ్బంది పడుతున్న జనాలకు అకాల వర్షాలు వేసవి తాపం తగ్గిస్తున్నాయి. మే మొదటి వారంలో 45 డిగ్రీలు దాటిన మండుతున్న ఎండలను మూడు రోజుల క్రితం నుంచి అడపాదడపా కురుస్తున్న వానలు వేసవి తాపాన్ని తగ్గించాయి. వారం రోజుల్లో మారిన వాతావరణంతో జనాలు ఊపిరి పీల్చుకుంటున్నారు.



మూడు రోజుల క్రితం చేగుంటలో కురిసిన అకాల వర్షం

బేలర్‌తో గడ్డి వృథాకు చెక్



హార్వెస్టర్‌తో కోసిన గడ్డిని కట్టలు కదుతున్న బేలర్ యంత్రం

- హార్వెస్టర్ కోతలతో పనికిరాని పశుగ్రాసం
- కోత తర్వాత వరికట్ట కట్టే యంత్రం
- రూ.30నుంచి 35వసూలు

హార్వెస్టర్‌తో కోసిన వరి పొలాల్లో గడ్డి తక్కువగా రావడంతోపాటు పొలంలో పడి వృథాగా మారుతోంది. దీంతో రైతులు ఆ అలాంటి గడ్డిని కాల్చేస్తున్నారు. డైరీ ఫారం నిర్వాహకులకు, పాల వ్యాపారంపై ఆధారపడుతున్న పాడిరైతులకు పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో బేలర్ యంత్రాలు బాగా ఉపయోగపడుతున్నాయి.

దుబ్బాకటౌన్: వరిగడ్డి కట్టే బేలర్ యంత్రాలు ట్రాక్టర్‌కు అనుసంధానం చేయబడి ఉంటాయి. హార్వెస్టర్ పంటను కోసినప్పుడు పొలంమంతా పడిన గడ్డిని బేలర్ యంత్రం కట్టలు కడుతుంది. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే దాదాపు 40–50 కట్టలుగా కడుతుంది. ఒక్కో కట్టకు రూ.30–35 తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు పొలంలోని గడ్డిని తీసుకెళ్లేందుకు ముందుగా రైతులకు ఎంతో కొంత డబ్బు చెల్లించి యంత్రంచేత కట్టలు కట్టిస్తున్నారు. గడ్డికి సైతం డబ్బులు వస్తుండడంతో చాలా మంది రైతులు బేలర్‌వైపే మొగ్గు చూపుతున్నారు.

వరిగడ్డికి భలే డిమాండ్

వానాకాలం సీజన్ వరి పంట కోసేంత వరకు ఎండు గడ్డి దొరికే పరిస్థితి ఉండదు. వానాకాలం ముగిసేవరకు గడ్డి దొరికే అవకాశం లేకపోవడంతో ఆవులు, గేదెల ఫారాల రైతులు గడ్డిని కొనుగోలు చేసి 3, 4నెలలపాటు వచ్చేలా నిల్వ చేసుకుంటున్నారు. దీంతో గడ్డికి డిమాండ్ ఏర్పడుతోంది.

కట్టలు కట్టి నిల్వ చేసుకుంటున్నా..



నాకు రెండు పాలిచ్చే గేదేలు ఉన్నాయి. మళ్లీ 3–4 నెలల వరకు పశుగ్రాసం దొరకదు. ప్రస్తుతం హార్వెస్టర్ కోసిన గడ్డిని కట్టలు కట్టించి నిల్వ చేసుకుంటున్నా. కట్టలు కట్టినందుకు 100కట్టలకు సుమారు రూ.3 వేల వరకు ఖర్చవుతోంది.
– ఎల్లారెడ్డి, రైతు, దుబ్బాక

కూలీల ఖర్చు తగ్గింది



బేలర్ యంత్రాలు రాకముందు గడ్డి వాము పెట్టాలంటే రోజుకు ఒక్క కూలీకి రూ.600 నుంచి 7వందల వరకు చెల్లించే వాళ్లం. ఇప్పుడు ఈ యంత్రాలతో కట్టలు కట్టించడం వల్ల కూలీల ఖర్చు తగింది. గడ్డిని ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చు.
– భాస్కర్, రైతు, దుబ్బాక


రేపటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ముస్తాబైన ఆలయం



వేణుగోపాలస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలకు ముస్తాబు అయ్యింది. దొరల కాలం నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా జంట నగరాలు, వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. ఈ నెల 17న బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజున విష్వక్సేన పూజ, పుణ్య వచనం, కంకణ ధారణము, పుట్ట బంగారం, అగ్ని ప్రతిష్ఠ, 18న హోమం, బలిహారం, ధ్వజారోహనం, స్వామివారి తిరు కల్యాణం, ఊరేగింపు, 19న శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలస్వామి పల్లకీ సేవ, 20న వామనావతార పల్లకీ సేవ, 21న రామావతార పల్లకీసేవ, 22న నరసింహావతార పల్లకీసేవ, 23న గరుడ రథసేవ, 24న పొన్నసేవ, 25 మోహినీ అవతార పల్లకీ సేవ, 26న రథోత్సవం, 27న నాగవల్లి, చక్రస్నానం, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



ఆలయ ప్రధాన గోపురం

రోడ్డుకు ఇరువైపులా పొదలు



మూసాపేట, దౌల్తాబాద్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

నర్సాపూర్‌రూరల్: రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలు పెరగడంతో రోడ్డు సరిగా కనిపించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మూసాపేట, నాగులపల్లి, జయరాంతండా, ఎల్లారెడ్డిగూడ తండాతోపాటు ఆ పరిసర గ్రామాల్లో ప్రజలు నిత్యం మూసాపేట మీదుగా సంగారెడ్డి వెళ్తుంటారు. హత్నూర మండలంలోని దౌల్తాబాద్ వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఉండటంతో తరచూ కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో అదుపుతప్పి కింద పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈఈ స్వామిదాస్‌ను వివరణ కోరగా.. మూసాపేట, దౌల్తాబాద్ రోడ్డును పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

బగలాముఖి ఆవిర్భావ వేడుకలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో బగలాముఖి అమ్మవారు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖి అమ్మవారి ఆవిర్భావాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం వేద పండితుడు గంగవరం ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణకుంభజలంతో బగలా అష్టోత్తర శతనామ మంత్రం, హరిద్రార్చన, పీతాంబరా, బగలాముఖీ పూర్ణకలశపూజ, పూర్ణకుంభ హరిద్రార్చిత, స్వర్ణజల అభిషేకం మహోత్సవం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బగలాముఖి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సంతోష్‌శర్మ, నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, సూర్యకుమార్‌గౌడ్, వెంకటేష్‌తో పాటు ఉన్నారు.

స్వశక్తి సంఘాలకే ప్లాస్టిక్ నిర్వహణ కేంద్రాలు

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాలలో చెత్త సేకరణలో భాగంగా తీసుకువచ్చే ప్లాస్టిక్ సామగ్రి నిర్వహణ కేంద్రాన్ని స్వశక్తి సంఘాలకు అప్పగించనున్నట్లు పంచాయితీరాజ్ శాఖ సలహాదారు కొండాల్‌రావు తెలిపారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌ను బుధవారం ఆయన సందర్శించి డంపింగ్ యార్డును పరిశీలించారు. వీధులలో చెత్తలేకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తలోని ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తారని తెలిపారు. వాటిపై మహిళా సంఘాల సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ) డైరెక్టర్ సురేశ్‌బాబు, డీపీఓ దేవకీదేవి, డీఆర్‌ఓ జయదేవ్‌ఆర్య, సిద్దిపేట, హుస్నాబాద్ డీఎల్‌పీఓలు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, డీపీఎం కరుణాకర్, ఎంపీడీఓ లక్ష్మప్ప, బెజ్జంకి, కోహెడ, చిన్నకోడూర్ మండలాల ఏపీఎంలు, ఎస్‌బీఎం కోఆర్డినేటర్‌లు, వీఓఏలు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కొండాల్‌రావు

'బీజేపీ దుష్ప్రచారం మానుకోవాలి'

మర్కూక్(గజ్వేల్): బీజేపీ నేతలపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారంటూ వస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మర్కూక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం బీజేపీ కార్యకర్తపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపీపీ పాండుగౌడ్ అనుచరులు దాడిచేశారనే విషయంలో వాస్తవం లేదని చెప్పారు. నిజానిజాలు తెలియకుండా అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదన్నారు. బీజేపీ కార్యకర్తలు తమ పార్టీ కార్యకర్తలపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితబోధ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు కనకయ్య, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు గాయాలు

రాయపోలు(దుబ్బాక): ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన ఘటన రాయపోలు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ షకీనాబీ దౌల్తాబాద్ వెళ్లి పనిపూర్తయ్యాక బుధవారం ఆర్టీసీ బస్సులో రాయపోలుకు తిరిగి బయలుదేరింది. రాయపోలు రాగానే బస్సు దిగి గ్రామం వైపు వెళుతుండగా ఆర్టీసీ బస్సు వెనుక టైర్ల కింద పడింది. దీంతో ఆమె ఎడమకాలికి తీవ్రంగా గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెను చికిత్స కోసం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పరామర్శ

గజ్వేల్: ఇటీవల మృతిచెందిన సిటిజన్స్ క్లబ్ సభ్యుడు నేతి నర్సింహులు కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పరామర్శించారు. నర్సింహులుతో తన కున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

పాతబావులు పూడ్చాలి

వర్గల్(గజ్వేల్): గ్రామంలో ఉన్న పాడుబడ్డ బావులు ప్రమాదకరంగా మారాయని మండలంలోని మజీద్‌పల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దోమలకు నెలవుగా మారి రోగాలు పంచుతున్నాయన్నారు. వెంటనే వాటిని పూడ్చాలని కోరారు.